# తపన

— వి. లక్ష్మణరావు

అనురాగం నిండిన మాతృమూర్తి ముఖంలో ప్రశాంతతలా ఉంది ప్రకృతి స్వరూపం. ప్రియుని స్పర్శతో ఎరుపెక్కిన ప్రియురాలి మోములా ఉంది పడమటి దిక్కు. ప్రకృతిలోని పక్షులందిస్తున్న సంగీతానికి తలలూపుతున్నాయా అన్నట్టున్నాయి వివిధ రకాలయిన చెట్లు. ప్రకృతిని చూస్తూ పులకిస్తున్న సరోజ మనసులో ఆలోచనల వెల్లువలు. నిరీక్షణలో నిక్షిప్తమై ఉండే ఆనందం, విషాదం, ఆసక్తి, ఆందోళన, అనురక్తి, నిర్లిప్తత సరోజకు అనుభవానికొస్తున్నాయి.

"సరోజా! నాలో ఏంచూసి నను వద్దావు?" సరోజను కలిసిన ప్రతిసారీ రాజారావు వేసే ప్రశ్న. రాజారావు ఫిజికల్లీ హాండీకాప్డ్! ఒకకాలు కుంటి. పట్నం ఒక మూలలో స్కూలు టీచరు, బ్రహ్మచారి. ఉన్న ఒక్క చెల్లెలికి పెళ్లిచేసి అత్తవారింటికి పంపించి ఒంటరివాడయ్యాడు.

సరోజ ఒక ప్రైవేటు నర్సింగ్‌హోమ్‌లో నర్సు. తల్లి చనిపోయిన తర్వాత ఆమెకు తోడు ఆమె ఆరాధించే ప్రకృతిమాతే.

"సిస్టర్! పనిలో మీరుచూపే శ్రద్ధ, మీ చిత్తశుద్ధి, మీ సేవానిరతి మా నర్సింగ్‌హోమ్‌కు మంచి పేరును తెస్తున్నాయి. ఈ నెల నుంచి మీ జీతాన్ని మరో యాభై రూపాయల మేరకు పెంచుతున్నాను" నర్సింగ్‌హోమ్ డైరెక్టర్ కరుణాకరరావు ఆమె వంక మెప్పుకోలుగా చూస్తూ అన్నమాటలు.

"డాక్టర్! జీవితంలో మనిషికి తనకంటూ ఏదీ కావాలనుకోనప్పుడు ఆ మనిషి పదిమంది సేవలోనే ఆనందాన్ని అనుభవిస్తుంది. ఈ నల్లపిల్లను ఆదరించారు. ఉపాధి కల్పించారు. మీకు సర్వదా కృతజ్ఞురాల్ని" కన్నులు చెమ్మగిల్లుతూంటే అంది సరోజ.

"సరోజా! మనిషి దేహంలోని లోపాలు మనిషిని మనసు పేదను చేయకూడదు. మనసు ధనం మెండుగా ఉన్న నువ్వు నిన్ను నువ్వు చులకన చేసుకోకూడదు."

"నన్ను నేను తెలుసుకోవడం వరకే, అది ఎంతో అవసరమనుకుంటాను" సరోజ గొంతులో నిర్లిప్తత ఆవరించింది.

"బెడ్ నెంబర్ 13కి మందు ఇవ్వాలి డాక్టర్!" అని బెడ్ నంబర్ 13 దగ్గరకు హడావిడిగా వెళ్ళింది సరోజ.

"సిస్టర్! పూర్వజన్మలో నేనెంతో పాపం చేసివుంటాను కదా. అందుకే ఈ భయంకరమైన వ్యాధి నాకొచ్చింది అవునా?" పేషెంటు గొంతులో నిరాశ, పశ్చాత్తాపం.

లివర్ కాన్సర్! ఎన్నాళ్ళో బ్రతకడని సరోజకూ తెలుసూ, పేషెంట్ శరత్‌కీ తెలుసు.

ఆ ప్రశ్నకు సమాధానం సరోజ దగ్గరలేదు. మౌనంగానే మాత్ర మింగించి నీరు త్రాగించింది.

"సిస్టర్! మీ స్పర్శలో అనిర్వచనీయమైన ఆనందం వుంది. రెండు క్షణాలు నా నుదుటిమీద మీ చేయి ఉంచరూ! పేషెంట్ గొంతులో అభ్యర్థన."

"నా చివరి దశలో నన్ను చూసి బాధపడే వాళ్ళు లేరన్న సంతృప్తి నాకుంది సిస్టర్. ఎన్నో నిర్భ్రాంతం నా తల్లి స్పర్శ నాకిచ్చిన ఆనందాన్ని ఇప్పుడు అందిస్తున్నారు. ఎంతో మంచి మనసున్న వారి స్పర్శ మాత్రమే ఈ సుఖానుభూతి నందించగలదని నా నమ్మకం. సిస్టర్! నా కథ వింటారా?"

అయిదేళ్ళ అనుభవంలో నర్సుగా సరోజ ఎన్నో కన్నీటికథల్ని వింది. కొందరి కన్నీటిని తన మమతానురాగాలతో తుడవ గలిగింది. కాని మృత్యువుకు అతి దగ్గరలో ఉన్న నిండా నలభై ఏళ్ళు కూడా లేని శరత్‌ను ఏ విధంగా ఊరడించగలదు.

"చెప్పనా సిస్టర్!" పసివాడి పట్టుదల ధ్వనించింది శరత్ గొంతులో.

నిరునవ్వు ముఖాన్ని వెలిగిస్తూంటే కుర్చీ మంచం దగ్గరకు లాక్కుని కూర్చుని చెప్పమంది.

"సిస్టర్! మా అమ్మకు నేనొక్కణ్ణే కొడుకును. నా అయిదవ ఏట మా నాన్నగారు పోయారు. అమ్మే నన్ను పెంచింది. చదివించింది. ఉద్యోగస్థుణ్ణి చేసింది. పెళ్ళి చేసింది. ఆమె బాధ్యత తీరిపోయినట్టుగా ఈ లోకాన్ని వదిలి వెళ్ళిపోయింది."

కన్నుల్లో నీరు, నిశ్శబ్దంగా ఉండిపోయాడు శరత్



గతం కళ్ళముందు మెదులుతోందనుకుంది సరోజ.

"సిస్టర్! అమ్మంటే నాకెంతో ఇష్టం" అతని గొంతు బొంగురు పోయింది. ఆగక స్రవిస్తోంది కన్నీరు.

"సిస్టర్! బెడ్ నెంబర్ 25 దగ్గరకు రమ్మంటున్నారు డాక్టర్ సదాశివం. క్విక్ ప్లీజ్!" తోటి సిస్టర్ చెప్పేసరికి "తర్వాత వస్తాను" శరత్‌కి చెప్పి వెళ్ళిపోయింది సరోజ.

"సరోజా! ప్రకృతి అందాలను తిలకిస్తూ ఈ

లోకాన్నే మరచిపోయావు. నా రాకనే గమనించలేదు నువ్వు" రాజారావు మాటలు సరోజను ప్రస్తుతానికి తెచ్చాయి.

"రాజా! పుట్టినవాడికి మరణం తప్పదు. అందరకూ తెలుసు, కాని కొద్ది రోజులలోనే తను మరణించడం ఖాయం అని తెలిసిన మనిషి మానసిక స్థితి ఎలా ఉంటుంది" బిగ్గరగా ఆలోచిస్తున్న ధోరణిలో అంది సరోజ."

"మనిషిని మనిషి దోచుకునే వ్యవస్థలో తోటి మనుషులకు సానుభూతి సహకారాలందించ గల ఈ వృత్తిలో వుండడం నీ అదృష్టం సరోజ" సరోజలో మనసుకు హాయికలిగించే అందాన్ని చూడగలిగే నేర్పును కలిగిన రాజారావు అన్నాడు."

"కూర్చో రాజా! నిరీక్షణలో ఆలోచనలు నిరీక్షణ కలిగించే బాధని తగ్గిస్తాయేమో!" రాజారావు తలను గుండెమీదకి తీసుకుని జుత్తును సవరిస్తూ అంది సరోజ.

ఆమె సన్నిధిలో కలిగే సుఖభావన కొన్నిక్షణాల పాటు అతన్ని మూగవాడిగా చేసింది.

"సరోజా! ఈ మమతానురాగాలు ఈ ఆదరణ చాలు ఈ జీవితానికి. ఎండి బీటలు వడిన జీవితానికి వసంతాన్నందించావు. మమతకు నోచుకోలేదేమోనన్న భయాన్ని తొలగించావు."

"ఇద్దరు వ్యక్తుల మధ్య మమత పరస్పరం నా తల్లి చనిపోయినప్పుడు రక్త బిందువులా నాకు తోడుగా నిలిచావు. అవిటితనం నీ శరీరానిది. నీ మనసు ఎంతో గొప్పది. ఆ గొప్ప మనసుతోనే నా మమతను గెల్చుకున్నావు. ఆ ...... మళ్ళీ మరుస్తాను. ఇదిగో నాలుగు వందలు "మానవతా సమాజానికి" చందాగా చెల్లించు. ఏ ఒక్క సాటిమనిషి కన్నీటిని తుడవడానికి, కష్టాల్లో ఆదుకోవడానికి మనం తోడ్పడగలిగినా, మన జీవితాలు అర్థరహితాలు కావు" తన పెదిమలలో అతని బుగ్గల్ని రాస్తూ అంది.

రాజారావు మనసు సుఖమయ ప్రపంచంలో విహరించసాగింది.

"సిస్టర్! నా కథ వినవూ?" ఆర్తిగా అడిగాడు బెడ్ నెంబర్ 13 పేషెంట్ శరత్.

మృత్యువు దగ్గరవుతున్నా, అతని జ్ఞాపకశక్తి పదిలంగా ఉందనుకుంది సరోజ. ఆలోచించడం

[illegible]

చేతనయిన మనిషికి తుదిశ్వాస వరకూ విశ్రాంతి లభించదేమో అనిపించిందామెకు.

"మా అమ్మంటే నాకు చాలా ఇష్టం సిస్టర్! ఎందుకంటే నాకు జన్మనివ్వడమే కాకుండా మంచి మనసిచ్చింది. అందుకే... అందుకే... విమలను..." అంతకు ముందు నర్సు ఇచ్చిన మాత్ర ఫలితంగా అతను నిద్రలోకి జారుకున్నాడు.

నిట్టూర్చి అక్కడనుంచి వెళ్ళిపోయింది సరోజ.

"నిదురించే నీ నీలి కురులను సవరిస్తూ ఒక జీవితకాలం ఆనందంగా గడిపేయగలను సరోజా!" తల చిక్కులు తీసుకుంటూంటే సరోజకు గుర్తుకొచ్చాయి రాజారావు మాటలు.

"మీకు నా కథ చెప్పకుండానే నిద్రపోయాను కదూ సిస్టర్! విమల నా భార్య!"

సరోజ ఆశ్చర్యంగా చూసింది రాజారావు వైపు. అతను ఆస్పత్రిలో చేరి నెల దాటింది. ఇప్పటివరకూ అతన్ని చూడ్డానికి రాలేదు ఆమె.

పెరిగిన గడ్డం వల్లనూ, అతని చిరునవ్వును మరింత మెరిసేట్టు చేసింది.

"ఆమె నన్ను విడిచి వెళ్ళిపోయింది" కన్నులు చమరిస్తూంటే నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

"భగవాన్! ఈ సృష్టిలో దీనగాథల్ని ఆస్పత్రి భవనాల్లో నిక్షిప్తం చేశావా?" మనసులో అనుకుంది సరోజ.

"అది ఆమె తప్పుకాదు సిస్టర్! మాతురికి ఏదోలా ఆ మూడుముళ్ళూ వేయించి తమ బరువు దింపుకోవాలన్న మధ్యతరగతి ఆత్రుతది ఆ తప్పు. ఆమెకు ఇష్టం లేకపోయినా ఆమె తల్లిదండ్రులు వివాహం జరిపించారు. నిండైన స్త్రీత్వం ఆమెది. సంసారసుఖాల గురించి ఎన్నో కలలు కన్నాను. కాని నిజం తెలిసిన తర్వాత మా మొదటిరాత్రి నాకు కాళరాత్రే అయింది. బతిమాలి ఒప్పించి ఆమెను ప్రియుడి దగ్గరకు చేర్చాను. పూర్తిగా ఒంటరివాణ్ణయి పోయాను. మమతానురాగాలకోసం తపించిపోయాను. నా బాధను చూడలేకనేమో భగవంతుడు ఈ విధంగా విముక్తి మార్గం చూపాడు."

సరోజ కన్నులు వర్షించ నారంభించాయి. ఒక త్యాగమూర్తికి సేవచేయగలిగే అదృష్టం తనకు లభించినందుకు దుఃఖం వెనువెంటనే ఆనందం కూడా కలిగింది.

"సిస్టర్! రాజారావుగారు ఏ రూములో ఉంటారు, ఒకసారి చూడొచ్చా!"

"తప్పకుండా! ఈ రిజిస్టర్లో మీ పేరు ఇతర వివరాలు వ్రాసి సంతకం చేయండి" వచ్చినామెను ఆశ్చర్యంగా చూస్తూ సరోజ రిజిస్టరు ముందుకు తోసింది.

"విమల"

"

ఆ పేరు చూసి ఆమెను పరిశీలనగా చూసింది సరోజ. ఆమెతో వచ్చిన వ్యక్తి రాజారావు కంటే అందంగా ధృఢంగా ఉన్నాడు. అతనే విమల ప్రియుడని ఊహించింది.

"మీరిక్కడే ఉండండి. నేను........."

"విమలగారూ! అధికారికంగా నాకు హక్కులేకున్నా మానవత్వం ఆధారంగా మిమ్మల్ని ఒకటి అడగాలని ఉంది. రెండుమూడు రోజులలో చనిపోయే వ్యక్తి పాతగాయాన్ని కెలకడం మీకు ధర్మంగా తోస్తోందా?" చాలా బిడియపడుతూనే అడిగింది సరోజ.

"కాదండి! వాస్తవాలు నాకు తెలుసు. పెద్ద డాక్టరు గారికి ఫోనుచేసి కనుక్కున్నాను. ఆ మానవతామూర్తి ఒంటరివాడినన్న బాధతో పోకూడదు. చివరి రోజుల్లో అండగా మేమున్నామన్న సంతృప్తితో అతను పుణ్యలోకాలకు వెళ్లాలి" అని లోనికి వెళ్ళిపోయింది విమల.

మానవత్వ మహోన్నత్వం తన కనులముందు ఆవిష్కరింపబడిన అనుభూతి కలిగింది సరోజకు. ●


రు. 1,50,000ల బహుమతులు గెలుపొందండి ఎంట్రీఫీజులేదు



| | | |
|---|---|---|
| 17 | 16 | 21 |
| 22 | 18 | 14 |
| 15 | 20 | 19 |

మొదటి బహుమతి: బజాజ్ స్కూటర్ లేక వి.సి.ఆర్.
కన్సోలేషన్ ప్రైజ్: కలర్ టి.వి. రు. 600 లకే లేక జపాన్‌మోడల్ నేషనల్ టూ-ఇన్-వన్ రు. 400 లకే చైన్‌లింక్ పద్ధతి ద్వారా.
పోస్ట్‌కార్డ్ మీద పైన చూపించిన విధంగా తొమ్మిది చదరపు గళ్ళు తయారుచేయండి. ఎటుకూడినా 57 వచ్చేలా 15 నుంచి 23 అంకెలు ఉపయోగించండి. ఒక అంకెను ఒకేసారి ఉపయోగించాలి. మీ ఎంట్రీలను ఆర్డినరీ పోస్ట్‌ద్వారా 10 రోజులలో పంపండి. మొదటి ఇరవై ఎంట్రీలకు ఫొటోగ్రాఫిక్ కెమేరా ఫ్రీ.

| | | |
|---|---|---|
| | | 22 |
| | 19 | |
| 16 | | |

AIR LINKERS (W-62.)
P.B: 4918, S.J. ENCL. NEW DELHI-110 029.